క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో దేవరపల్లి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

డ్రెయినేజీ పనులకు భూమి పూజ



గుడివాడ టౌన్: పట్టణంలోని ఏ ప్రాంతంలోనూ మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. బేతవోలు వడ్డెరవారి వీధిలో బుధవారం నూతనంగా నిర్మిస్తున్న డ్రెయిన్ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన మురుగునీటి సమస్యను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. అంతర్గత లింక్‌లు కలపడం ద్వారా మురుగునీటిని పట్టణం నుంచి బయటకు తరలించేందుకు వీలు కలుగుతుందని ఇందులో భాగంగానే నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పోలాసి వాసు, సచివాలయ ఇన్‌చార్జ్ వీరిశెట్టి నరసింహారావు, అడబాల హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు పరిశీలన



మండవల్లి: మండవల్లి పరిధిలో విస్తరించి ఉన్న భీమవరం–విజయవాడ నేషనల్ హైవే రోడ్డులో మరమ్మతులను సర్పంచ్ మెండా ఝాన్సీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను సమీక్షించి తగు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, ఈఓపీఆర్డీ ఆనంద్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరంలో కోడిపందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోడిపుంజు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై పంపినట్లు పేర్కొన్నారు.

రైతుబజారులో చౌకధరల దుకాణం



చౌకధరల దుకాణం ప్రారంభిస్తున్న తహసీల్దార్ తదితరులు

గుడివాడ టౌన్: అధిక ధరలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు స్థానిక రైతు బజారులో బుధవారం చౌక ధరల దుకాణం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు. జేసీ ఉత్తర్వుల మేరకు బియ్యం, కందిపప్పు ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని దుకాణం ఏర్పాటుచేశామని చెప్పారు. కిలో సోనా మసూరి బియ్యం రూ.48, బీపీటీ రకం రూ.46, కందిపప్పు రూ.135 చొప్పున విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గుడివాడ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రైతు బజారు ఈఓ ఓగిరాల శ్రీకాంత్ , గుడివాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు చక్కా చెన్నకేశ్వరరావు, ఆర్‌ఐ నాగబాబు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

కృత్తివెన్ను: చినగొల్లపాలెంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న మత్స్యకారుల శిక్షణ బుధవారంతో ముగిసింది. వేట సమయంలో సముద్రంలో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాద సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలి, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు చేసి చూపించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్, స్విమ్మింగ్ టెక్నిక్స్ తెలియజేశారు. శిక్షణలో ఐటీ యూఎస్ కంపెనీ నుండి ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, ఇన్‌చార్జి కొండలరావు, ట్రైనర్ సాయి, ఎఫ్‌డీఓ అంజనీదేవి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

కైకలూరు: జగనన్న సురక్షతో సత్వర సేవలు ప్రజలకు అందుతున్నాయని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. కైకలూరు సచివాలయం – 3కి సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో 404 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, పీఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, తహశీల్దారు బి.మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ రవిశంకర్, శీతనపల్లి పీహెచ్‌సీ డాక్టరు హేలత, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం చరణ్, పంచాయతీ కార్యదర్శి జి.శవన్నారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రావర్ల(పామర్రు): జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో మంది ప్రజలకు మేలు చేకూరుతోందని గ్రామ సర్పంచ్ కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు అన్నారు. రావర్ల సచివాలయం వద్ద జమీదగ్గుమిల్లి, రావర్ల, పోలవరంఉండ్రపూడి గ్రామాలకు సంబంధించి బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హత ఉండి ఏ ఒక్కరూ పథకాల ద్వారా లబ్ధి పొందకుండా నష్టపోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, సచివాల కన్వీనర్ సురేష్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పోలవరం సర్పంచ్ శ్రీలక్ష్మీ, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, రాంబాబు, తహసీల్దార్ వీవీ భరత్ రెడ్డి, ఎండీవో వై.రామకృష్ణ, వీఆర్వో పూర్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు

కూచిపూడి(మొవ్వ): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేద, బడుగు వర్గాలకు మేలు చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి తెలిపారు. మొవ్వ మండలం కూచిపూడి సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 1058 పలు రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీటీసీ వెలగం రమణ, సర్పంచ్ కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, ఈవోపీఆర్డీ వీర్ల సీతారామరాజు, ఈవో ఐ.భవాని పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీలు, ఎంపీపీ తదితరులు



మొక్కలు నాటుతున్న ఎంపీపీ అడవి కృష్ణ

నేడు ఉనికిలిలో జగనన్న సురక్ష

మండవల్లి: మండలంలోని ఉనికిలి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము) బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. దరఖాస్తుదారుల సమస్యలను అధికారులకు తెలియజేసి ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.భావనారాయణ అన్నారు. దండిగానపూడి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సంక్షేమ పథకాలన్నీ పొందాలని ఈ కార్యక్రమం జరుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా 641 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ కోటేశ్వరరావు, దండిగానపూడి, గండేపూడి, పొనుకుమాడు సర్పంచ్‌లు జాజుల జోత్స్నాదేవి, కర్నాటి సత్యనారాయణ, తెనాలి అరుణకుమారి, ఎంపీటీసీ తిరుమలశెట్టి ఉషారాణి, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు

అందరికీ న్యాయం కోసమే జగనన్న సురక్ష

మండవల్లి: అందరికీ పథకాల లబ్ధి అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 419 వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, ఎంపీడీఓ టీకే వెంకటరమణ, తహసీల్దార్ కె. రాజ్‌కుమార్, ఆర్‌ఐ పద్మరోజా, ఇన్‌చార్జి ఏపీఓ నవీన్, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న యేసోబురాజు

అభివృద్ధి పనులకు సహకరించాలని వినతి



జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక రాముతో ఎంపీపీలు, జెడ్పీటీసీలు

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ మండలాల అభివృద్ధికి సహకరించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రామును కలసి కోరినట్లు ఎంపీపీలు గద్దే పుష్పరాణి, పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ సభ్యులు గోళ్ల రామకృష్ణ, కందుల దుర్గాకుమారి తెలిపారు. మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశానికి హాజరైన అనంతరం రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపట్టాల్సిన అభివృద్ధి, ఇతర సంక్షేమాల గురించి చైర్‌పర్సన్‌కు వివరించామని చెప్పారు. జెడ్పీ నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. నందివాడ, గుడివాడ మండలాల్లో జిల్లా పరిషత్ రోడ్లు కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయని తెలిపారు. వాటి మరమ్మతులకు సైతం నిధులివ్వాలని కోరామని చెప్పారు. దీనికి స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికరాము ఈ రెండు మండలాలతో పాటు గుడ్లవల్లేరు మండలాన్ని కూడా అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

మండవల్లి: అప్పాపురంలో ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు బుధవారం పోలీసులు పేర్కొన్నారు. మండవల్లి ఎస్‌ఐ టి.రామకృష్ణకు అందిన సమాచారం మేరకు అప్పాపురం డొంకలో పేకాటాడుతున్న ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల చెంతకే ధ్రువీకరణ పత్రాలు

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే అధికార యంత్రాంగం వచ్చి ధ్రువపత్రాలు అందిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు నియోజకవర్గంలో కలిదిండి మండలం సానారుద్రవరం, ముదినేపల్లి మండలం గురజ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ చరిత్రలో ప్రజల వద్దకే ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం ఇప్పటివరకు జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయం పరిధిలో వందలాది మందికి 11 రకాల ధ్రువపత్రాలను అందిస్తున్నామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రజా సంక్షేమ పథకాలను సీఎం అందిస్తున్నారన్నారు. ధ్రువపత్రాలను పంపిణీ చేసిన అనంతరం ఆయా సచివాలయాల వద్ద మొక్కలను నాటారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో క్యాంపునకు వచ్చిన ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు గంటా సంధ్య, సర్పంచులు మంచాల సరస్వతి, గద్దె ఆనందకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఏసుబాబు, రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భాస్కరావుపేటలో రూ.20 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, రూ.2లక్షల నిధులు వెరసి రూ.22 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లును ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



ప్రజలకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

ఆర్డీవో పి.పద్మావతి

గుడివాడ టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో పి.పద్మావతి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాల్లో నియోజకవర్గానికి చెందిన గుడివాడ అర్బన్, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్స్‌కు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌వోలు చెక్‌లిస్ట్‌లు సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని 230 పోలింగ్ కేంద్రాలకు గాను సుమారు 600 మంది ఓటర్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదన్నారు. దానికి సంబంధించి గురువారం నుంచి బూత్ లెవల్ ఆఫీసర్స్ ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించాలని చెప్పారు. శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, వివాహాలు చేసుకొని, ఇతర కారణాల చేత గ్రామాలు విడిచిన వారు వివరాలను రెండు రోజుల్లో సేకరించాలన్నారు. ఇప్పటికే దీనిపై సచివాలయాల్లో పూర్తి సమాచారం అందుబాటులో ఉన్న నేపథ్యంలో కేవలం ఒక్కొక్క బూత్ లెవల్ ఆఫీసర్ 20 నుంచి 30 మంది వివరాలు తెలుసుకుంటే సరిపోతుందన్నారు. స్థానికంగా అందుబాటులో లేని వారి వివరాలను తెలుసుకుని ఆ కుటుంబ సభ్యులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఏ ఓటరైతే అందుబాటులో లేరో వారికి సంబంధించిన సమాచారం సేకరించి వారికి సైతం ఓటు తొలగిస్తున్నట్లు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఎవరైనా ఓటరు అందుబాటులో లేక ఓటు తొలగించేందుకు కుటుంబ సభ్యులు నిరాకరిస్తే నోటీసును తలుపునకు అంటించి ఫొటో తీసి సమాచారాన్ని భద్రపర్చాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు తహసీల్దార్‌లు కె. ఆంజనేయులు, వి.భావన్నారాయణ, అబ్దుల్ రెహమాన్ మస్తాన్, డెప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) డి.లోకరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ, ఇతర అధికారులు

ఓటర్ల నమోదు ప్రక్రియకు సహకరించాలి

పామర్రు: ఓటర్ల నమోదు ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని పార్టీల నాయకులతో సాధారణ ఎన్నికల ఓటరు జాబితా తయారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన ఓటర్ల పేర్లు తప్ప మిగతా పేర్లను నేరుగా ఓటరు జాబితా నుంచి తొలగించకూడదని చెప్పారు. ఓటరు సవరణ నమోదు ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. రెండు కిలోమీటర్ల దూరానికి మించి ఉండే పోలింగ్ కేంద్రాల పరిధిలో అవసరమైతే అదనపు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సర్వేలో 18 ఏళ్ల నిండిన వారిని ఓటర్లగా చేర్చుకునేందుకు ఫాం 6ను వినియోగించాలని కోరారు. ఎన్‌ఆర్‌ఐల వివరాలను నమోదుకు 6ఏ ఫాం పూర్తి చేయాలన్నారు. చనిపోయిన వారిని, ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లి పోయిన వారిని తొలగించేందుకు ఫాం 7ను వాడాలని తెలిపారు. అన్ని రకాల సవరణలు చేసేందుకు ఫాం 8ని వినియోగించాలన్నారు. పామర్రు నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల 1,79,101 మంది ఉన్నారని వెల్లడించారు. వీరిలో మహిళలు 91,943 , పురుషులు 87,152 మంది ఉండగా 6 గురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని వివరించారు. నియోజకవర్గంలో మొత్తం 157 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 1200 ఓట్లు మాత్రమే ఉండాలని అంతకన్నా ఎక్కువ ఉంటే మరొక బూత్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఆరేపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు జి.లక్ష్మీదాసు, కె.ప్రవీణ్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

పామర్రు: నిస్వార్థంగా ప్రజలకు సేవలు చేసేందుకు నియమించిన వలంటీర్లపై విమర్శలు చేయడాన్ని పలువురు తీవ్రంగా తప్పు పడుతున్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా సేవలు అందిస్తున్న వారిపై విమర్శలు చేస్తున్న వారు వెంటనే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని కోరుతున్నారు. కరోనా కష్ట కాలంలో ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్లి ప్రజలకు వైద్య సేవలు, కుటుంబ అవసరాలను తీర్చి వారిని కంటికి రెప్పలా కాపాడిన వలంటీర్లపై లేనిపోని నిందలు మోపడం దారుణం అన్నారు. వలంటీర్ల తమకు కేటాయించిన వారి అవసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించి తగు విధంగా సహాయ సహకారాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు.

ఏ సహాయం కావాలన్నా చేస్తాడు



నా పేరు శ్రీపతి ఉష. నేను పామర్రు 8వ వార్డులోని ఆర్ హెచ్ నగర్‌లో ఉంటున్నాను. మా వలంటీర్ కోటి ప్రసాద్ నాకు ఏ సహాయం కావాలన్నా చేసి పెడుతూ కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. కరోనా సమయంలో ఇంటిల్లపాది జ్వరాలతో బాధపడుతూ ఉంటే ధైర్యంగా మా ఇంటికి వచ్చి మా ఆరోగ్య విషయాలు తెలుసుకుని మాకు అవసరమైన మందులు, మెడికల్ కిట్లు అందజేశాడు. ఆ సమయంలో ఇంటి నిత్యావసరాలనూ మాకు అందజేసి ఆదుకున్నాడు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని మాకు వివరంగా చెప్పి నాతో దరఖాస్తు చేయించి లబ్ధి చేకూర్చాడు. ఇటువంటి సేవలు అందిస్తున్న వలంటీర్లపై కొందరు అన్యాయంగా మాట్లాడుతున్నారు. ఇది సమంజసం కాదు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పది కాలాల పాటు చల్లగా ఉండాలి.

కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు



నా పేరు ఉప్పాడ సన్యాసిరావు. మాది పమిడిముక్కల మండలం తాడంకి గ్రామం. మా వలంటీర్ నీలాపు రమణ దివ్యాంగుడైనా ఎంతో ఉత్సాహంగా పనిచేస్తాడు. ప్రభుత్వ పథకాల గురించి మాకు వివరించి దరఖాస్తు చేయిస్తాడు. సంక్షేమ పథకాల ద్వారా నాకు ఆటోకు రూ.10 వేలు, నా తల్లికి చేయూత, భార్యకు సున్నా వడ్డీ, ఆసరా పథకాలు వస్తున్నాయి. ఇంటి స్థలం మంజూరైంది. వలంటీర్ సక్రమంగా పనిచేయడం వల్లే మా లాంటి వాళ్లకు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా పథకాలు అందుతున్నాయి.

చూడి గేదెను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



కైకలూరు: కైకలూరు అగ్నిమాపక సిబ్బంది ఆపదలో చిక్కుకున్న చూడిగేదెను రక్షించారు. బుధవారం కైకలూరు సబ్‌జైల్ వెనుక బుధవారం రైతు నాగరాజుకు చెందిన చూడిగేదె డ్రెయిన్‌లో పడింది. పైకి రాలేక నానా అవస్థలు పడుతోంది. దీంతో వెటర్నరీ సిబ్బంది అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో అగ్నిమాపక అధికారి కె.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రీధర్, శ్రీను, మురళీ కొన్ని గంటలు శ్రమించి ఎట్టకేలకు గేదెను బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బంది తెగువను పలువురు అభినందించారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

కాజ(మొవ్వ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తెలిపారు. మొవ్వ మండలం కాజలోని బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు, వలంటీర్లు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలు మన్ననలు అందుకుంటుందన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థలతో అవినీతి రహిత పాలన ప్రజలకు అందుతుందని తెలిపారు. అలాగే సంక్షేమ ఫలాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఎంపీటీసీ పేకేటి వెంకట లక్ష్మీ, ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, మర్రిరెడ్డి ఖాజీ రెడ్డి, నాయకులు పేకేటి సీతారామిరెడ్డి, వేల్పూరి వెంకయ్య, కొడాలి నాగరాజు, రాయవరపు రాజేష్, పంచాయతీ పాలక మండలి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

కూరగాయల మొక్కలు పంపిణీ

గుడివాడ టౌన్: ఇంటి పెరట్లో ఎరువులు వెయ్యని కూరగాయలు పండించుకోవడం మంచిదని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి అన్నారు. స్థానిక పంచవటి కాలనీ, కనక దుర్గ అమ్మవారి దేవస్థానం ఎదుట గల కాలనీ వాసులకు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కూరగాయల మొక్కలు పంపిణీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇంటి పెరట్లోనే వంగ, టమాట, పచ్చి మిర్చి, బచ్చలి, గోంగూర, బెండ, చిక్కుడు, పొట్ల, సొర వంటి కాయగూరలు పండించుకోవచ్చునని తెలిపారు. ఏవిధమైన రసాయన ఎరువులు వాడకుండా కూరగాయలు పండిస్తే అవి ఆరోగ్యానికి మంచిదన్నారు. ఇందుకు కావాల్సిన మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ జిల్లా చైర్మన్ పి.శేషగిరిరావు, కార్యదర్శి గుత్తా రమేష్, గుడివాడ అధ్యక్షుడు యు.మారుతీప్రసాద్, డైరక్టర్ దండమూడి సీతారామస్వామి, కె. రామారావు, సీహెచ్‌వీ మోహనరావు, ఎస్.పద్మజ, జి.శైలజ, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో ఈ నెల 2వ తేదీన జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు వివరాలను బుధవారం ఎస్‌ఐ ఎ. పైడిబాబు మీడియాకు తెలిపారు. గ్రామానికి చెందిన గంటా రాజేశ్వరి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 2వ తేదీన ఇంటికి తాళం వేసి విధుల నిమిత్తం బంటుమిల్లి కార్యాలయానికి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాల్లో భద్రపరచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన ముంజులూరు సమీపంలోని లజ్జబండ డ్రెయిన్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతున్నారన్న సమాచారంపై పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న పంపన సాయి, కర్రా లాజర్ పాత నేరస్తులుగా విచారణలో తేలింది. వారి నుంచి రూ. 1.60 లక్షల విలువ చేసే 38 గ్రాముల బంగారం , 36 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు ఇద్దరికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.